# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 26, జులై 2026


## జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

### ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట తప్పనిసరి: మంత్రి సీతక్క

నిర్మల్, జులై 25, ప్రభాతవార్త:



భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం సెర్ప్ సీఈఓ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్‌తో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా భూగర్భ జలాలను పరిరక్షించడం అత్యవసరమన్నారు. "ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట" అనే నినాదంతో భూగర్భ జల సంరక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి రైతు తమ పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండేలా చూడాలని సూచించారు. ఉపాధి హామీ పథకం (విబిజి రామ్ జి) పనుల్లో రాష్ట్రం దేశంలోనే ముందువరుసలో ఉందని పేర్కొన్నారు. అర్హులైన మిగతా 2లో..

## ప్రజల బలహీనతలపై వ్యాపారం...

- అత్యవసర అవసరాలను ఆసరాగా చేసుకుని ఆకర్షణీయ హామీలు
- అధిక వడ్డీలు, కఠిన వసూళ్లతో కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలోకి..
- అప్రమత్తతే ప్రజలకు రక్షణ

# అప్పు పేరుతో ఆస్తులపై కన్ను..!

మంచిర్యాల జులై 25,ప్రభాతవార్త

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొన్ని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నేటి కాలంలో ఆర్థిక అవసరాలు ప్రతి కుటుంబ జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, చిన్న వ్యాపారాలు, కుటుంబ అవసరాల కోసం చాలామంది అప్పులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా మార్చుకుని అనేక రుణ సంస్థలు, పొదుపు పథకాల పేరుతో పనిచేస్తున్న సంస్థలు ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి.





2లో..

### అధిక ధరలకు ఎరువుల విక్రయిస్తే

# కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్

దహెగాం,జూలై 25, ప్రభాతవార్త :



దహెగాం మండల రైతు వేదికలో శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిషేధించిన కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించరాదని స్పష్టం చేశారు.రైతులకు విక్రయించే ప్రతి ఎరువు, పురుగుమందుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. ఎరువుల దుకాణాలపై రైతులు చేసే ఫిర్యాదులను వెంటనే పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.విత్తనాల నిల్వలను విత్తనాల నిల్వ నమోదు పుస్తకంలో తప్పనిసరిగా నమోదు చేయాలని, ఎరువుల విక్రయాలను ఎరువుల విక్రయ దరఖాస్తు వ్యవస్థ మరియు విక్రయ యంత్రం ద్వారానే నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం అనుమతించిన ఏడు రకాల వరి విత్తనాలను కొనుగోలు చేసిన రైతుల వివరాలను ప్రభుత్వ సమాచార వ్యవస్థలో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.ఈ ఏడాది తగినంత వర్షపాతం నమోదయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నందున వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి మిగతా 2లో..

### విద్యార్థుల నమోదు లక్ష్యసాధనలో

# మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

- ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసానికి ఇది నిదర్శనం
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, జూలై 25, ప్రభాతవార్త

10 శాతం అదనపు విద్యార్థుల నమోదు లక్ష్య సాధనలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి. చంద్రయ్యతో కలిసి యు-డైస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో జూలై 25, 2026 నాటి విద్యార్థుల నమోదు నివేదికను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో నమోదైన విద్యార్థుల సంఖ్య కంటే 10 శాతం అదనపు విద్యార్థులను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించిందని, గత విద్యా సంవత్సరంలో జిల్లాలో 43 వేల 72 మంది విద్యార్థులు ఉండగా, 202627 విద్యా సంవత్సరానికి 47 వేల 379 మంది విద్యార్థుల నమోదు లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో 45 వేల 350 మంది విద్యార్థులు నమోదయ్యారని, గత సంవత్సరంతో పోలిస్తే ఇప్పటికే 2 వేల 278 మంది అదనంగా చేరారని, దీనితో 10 శాతం అదనపు నమోదు లక్ష్యంలో 95.72 శాతం సాధించి మంచిర్యాల జిల్లా రాష్ట్రంలో మిగతా 2లో..

## అధిక ధరలకు ఎరువుల విక్రయిస్తే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు ఎలాంటి కొరత లేకుండా అందించాలని డీలర్లకు సూచించారు. నాసిరకం లేదా నకిలీ పురుగుమందులు విక్రయించినా, రైతులను మోసగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు వినోద్, ఆఫ్రోజ్, లావణ్య, రోహిణితో పాటు మండలంలోని ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి పేద కూలీకి పనిదినాలు కల్పించాలని, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీసీలో నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మందమర్రిలో రోడ్డు ప్రమాదం..

## ముగ్గురు యువకులకు గాయాలు

**మందమర్రి, జూలై25, ప్రభాతవార్త:**





మందమర్రి పట్టణంలోని మేడారం ప్రాంతంలో నయారా పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు ప్రయాణిస్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు రోడ్డుపై పడిపోగా, ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేస్తే సహించం: రావుల రాంనాథ్

**నిర్మల్, జులై 25, ప్రభాతవార్త:**

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే, అసెంబ్లీ ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీజేపీ సీనియర్ నాయకులు హెచ్చరించారు. శనివారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్, పట్టణ కౌన్సిలర్లు సాధం అరవింద్, గంజి రాజు, జింక సూరి, శ్రీరామోజు నరేష్, శశాంక్, సాత్విక్, విఠల్, సూరజ్ నాయక్ మాట్లాడారు. ఈ సందర్భంగా రావుల రాంనాథ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఏ ఒక్క వార్డుకో పరిమితం కాదని, నియోజకవర్గ పరిధిలోని ప్రతి అంగుళం, మున్సిపాలిటీ, ప్రతి గ్రామం ఆయన పరిధిలోకి వస్తాయన్నారు. లక్షలాది మంది ప్రజల మద్దతుతో 50 వేలకు పైగా భారీ మెజారిటీతో గెలిచిన మహేశ్వర్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత 300, 400 ఓట్లతో గెలిచిన మున్సిపల్ వైస్ ఛైర్మన్ గణేష్‌కు లేదని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేకు మున్సిపాలిటీ పనులు, అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించే పూర్తి అధికారిక, చట్టబద్ధమైన హక్కు ఉందన్నారు. రివ్యూకు హాజరుకావడం మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఏ అధికారి అయినా కనీస బాధ్యత అని తెలిపారు. దీన్ని పక్కదోవ పట్టించేందుకు అధికారుల కులాలు, వర్గాలను రాజకీయం చేయడం దిగజారుడు రాజకీయమని విమర్శించారు. మహేశ్వర్‌రెడ్డి తెచ్చిన రూ.15 కోట్ల నిధులను, అమృత్ పథకం కేంద్ర నిధులను కాంగ్రెస్ నాయకులు తమకు అనుకూలమైన వార్డులకు, ఎంఐఎం వార్డులకు అక్రమంగా మళ్లిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ వార్డులు, ఎక్కువ మంది హిందువులు ఉన్న వార్డులకు మంజూరైన నిధుల్లో కోత విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో కనీస మౌలిక వసతులు కల్పించలేని చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే వైస్ ఛైర్మన్ విమర్శలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే నిధుల దుర్వినియోగాన్ని ఆపి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## నేడు కాగజ్‌నగర్‌కు ప్రొఫెసర్ కోదండరాం

**కాగజ్‌నగర్ రూరల్,జూలై 25, ప్రభాతవార్త :**

తెలంగాణ జేఏసీ, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) ఉదయం 10 గంటలకు స్థానిక పటేల్ గార్డెన్స్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలంగాణ జేఏసీ సిర్పూర్ కన్వీనర్ అడ్వకేట్ వి. కిషోర్ కుమార్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక కాగజ్‌నగర్ కన్వీనర్ ఈర్ల విశ్వేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

### ప్రజల బలహీనతలపై వ్యాపారం...

# అప్పు పేరుతో ఆస్తులపై కన్ను..!

(మొదటిపేజీ తరువాయి)

తక్కువ పత్రాలు, తక్షణ నగదు, సులభ వాయిదాలు, అధిక లాభాలు వంటి హామీలతో ప్రజలను తమవైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలు, చిన్న వ్యాపారులు, రైతులు, మధ్యతరగతి ప్రజలు ఈ హామీలను నమ్మి ముందుకు వస్తున్నారు.

### చదవని ఒప్పందాలే పెద్ద ప్రమాదం..

అప్పు తీసుకునే సమయంలో ఒప్పందంలోని నిబంధనలను పూర్తిగా చదవకపోవడం, అర్థం చేసుకోకపోవడం వల్ల తరువాత అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధిక వడ్డీ, ఆలస్య చెల్లింపులపై భారీ జరిమానాలు, అదనపు రుసుములు అప్పు భారాన్ని మరింత పెంచుతున్నాయి.

### ఆస్తులు కోల్పోతున్న బాధితులు..

కొన్ని సందర్భాల్లో ప్రజల అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారి ఇళ్లు, భూములు, ఇతర ఆస్తులపై హక్కులు సంపాదించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జీవితకాల పొదుపు, ఆస్తులను కోల్పోయి అనేక కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

### ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఏ సంస్థ వద్ద నుంచైనా అప్పు తీసుకునే ముందు ఆ సంస్థకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా లేదా తెలుసుకోవాలి. వడ్డీ రేటు, మొత్తం చెల్లించాల్సిన మొత్తం, ఆలస్యమైతే విధించే జరిమానాలు, ఒప్పందంలోని ప్రతి నిబంధనను పూర్తిగా అర్థం చేసుకున్న తరువాతే నిర్ణయం తీసుకోవాలి. కేవలం ప్రకటనలు, మధ్యవర్తుల మాటలు లేదా ఆకర్షణీయ హామీలను నమ్మి నిర్ణయం తీసుకోవడం ప్రమాదకరం.

### ప్రభుత్వం మరింత అప్రమత్తం కావాలి

ప్రజలను మోసం చేసే అక్రమ రుణ సంస్థలపై ప్రభుత్వం, సంబంధిత నియంత్రణ వ్యవస్థలు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామాలు, పట్టణాల్లో ఆర్థిక అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు సరైన సమాచారం అందించాలి. మోసపూరిత సంస్థలను గుర్తించి వాటిపై వెంటనే చర్యలు తీసుకునే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### అవగాహన ఉంటేనే ఆర్థిక భద్రత

డబ్బు అవసరం సహజమే. అయితే పూర్తి సమాచారం లేకుండా, నిబంధనలు తెలుసుకోకుండా తీసుకునే నిర్ణయం జీవితాంతం భారంగా మారే ప్రమాదం ఉంది. ఆలోచించి తీసుకున్న ఆర్థిక నిర్ణయం కుటుంబ భవిష్యత్తును కాపాడుతుంది. తొందరపాటు నిర్ణయం ఆస్తులను, మనశ్శాంతిని కోల్పోయే పరిస్థితులకు దారితీసి చివరకు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి తీసుకు వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## విద్యార్థుల నమోదు లక్ష్యసాధనలో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

(మొదటిపేజీ తరువాయి)

మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా 2వ స్థానంలో, జగిత్యాల జిల్లా 3వ స్థానంలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని 275 ప్రభుత్వ పాఠశాలలు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 10 శాతం కంటే అధిక విద్యార్థుల నమోదును సాధించాయని తెలిపారు. మండలాల వారీగా మందమర్రి, జైపూర్ మండలాలు 100 శాతం లక్ష్యాన్ని చేరుకోగా, హాజీపూర్ 99.91 శాతం, నస్పూర్ 99.76 శాతం, భీమారం 98.24 శాతం, నెన్నెల్ 98 శాతం అత్యుత్తమ పురోగతి సాధించాయని తెలిపారు. మొత్తం 18 మండలాలలో 10 మండలాలు 96 నుంచి 100 శాతం వరకు లక్ష్యాన్ని చేరుకున్నాయని తెలిపాతెలిపారు. జూలై 23 నాటి యు డైస్ గణాంకాల ప్రకారం 3 వేల 352 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలలో చేరడం ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో అత్యున్నత అర్హతలు కలిగిన ఉపాధ్యాయులతో పాటు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (స్మార్ట్ టీవీలు), ఐ.సి.టి. కంప్యూటర్ ల్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ విద్యను అందిస్తున్నామని, ఈ విద్యా సంవత్సరంలో 82 పాఠశాలలలో కంప్యూటర్ బోధకులను నియమించడం జరిగిందని తెలిపారు. పాఠశాలలలో మౌలిక వసతులు బలోపేతం చేయడంతో పాటు 8 అకాడమిక్ పర్యవేక్షక బృందాలను ఏర్పాటు చేసి విద్యా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. బాలికలు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రెసిడెన్షియల్ విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నామని, అవసరమైన వసతి గృహ, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని తెలిపారు.

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి తెలిపిన వివరాల ప్రకారం ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో చదువు పూర్తి చేసిన విద్యార్థులను తదుపరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో స్వయంగా చేర్పించేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన బాలికలను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని వివరించారు. జిల్లా స్థాయిలో తరచూ జూమ్ సమీక్షలు నిర్వహించడం, మండల విద్యాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం, ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మారే విద్యార్థుల బదిలీలను వేగంగా ఆమోదించడం, 8 అకాడమిక్ పర్యవేక్షణ బృందాల ద్వారా పాఠశాలల పనితీరును మెరుగుపరచడం వంటి చర్యల ఫలితంగానే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిందని తెలిపారు.

## బెల్లంపల్లి ఫుడ్ పాయిజన్ ఘటనపై చర్యలు

### - ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపల్, డిప్యూటీ వార్డెన్ సస్పెన్షన్

**బెల్లంపల్లి, జూలై 25, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు ఫూలే పాఠశాలలో ఇటీవల చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో, పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవి, డిప్యూటీ వార్డెన్ సుజాతలను సస్పెండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులుగా పేర్కొంటూ, వారి నిర్లక్ష్యమే కారణమని నిర్ధారించిన రాష్ట్ర ఎం జేపీ పాఠశాలల సెక్రటరీ సైదులు శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఎం జేపీ ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ ఎస్. శ్రీధర్ వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం సహించబోమని అధికారులు స్పష్టం చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

## మున్నూరు కాపు సంఘానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి

**కాగజ్‌నగర్ రూరల్,జూలై 25, ప్రభాతవార్త :.**




మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మున్నూరు కాపు సంఘం పటేల్స్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ ఆధ్వర్యంలో శనివారం కాగజ్‌నగర్ మండల తహసీల్దార్ మధుకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గజ్జల లక్ష్మణ్ మాట్లాడుతూ, సిర్పూర్ తాలూకాతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలో మున్నూరు కాపు కులస్తులు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని, సంఘ సమావేశాలు, సామాజిక, సాంస్కృతిక, విద్యా, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించేందుకు శాశ్వత కమ్యూనిటీ హాల్ అవసరమని తెలిపారు. అందుకోసం 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, రెవెన్యూ ప్రక్రియ పూర్తి చేసి, తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్‌ను కోరారు. వినతిపై స్పందించిన తహసీల్దార్, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గజ్జల లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బొలిశెట్టి మహేష్, జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, సిర్పూర్ తాలూకా మహిళ అధ్యక్షురాలు బొలిశెట్టి అరుణ, తాలూకా వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లి తిరుపతి, మున్నూరు కాపు సంఘ సభ్యులు పెద్దింటి హనుమంతు, పులిశెట్టి వెంకటేష్, కిరణ్, పార్వతి సురేష్, సాయిదామ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్కాహం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



మాట్లాడుతున్న మెప్మా సహాయ జిల్లా మిషన్ సమన్వయకర్త మోతీరాం



విద్యార్థులతో మున్సిపల్ అధికారులు

# విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణపై అవగాహన

### - కాగజ్‌నగర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం

**కాగజ్‌నగర్ రూరల్,జూలై 25, ప్రభాతవార్త :**

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే భావనను విద్యార్థుల్లో పెంపొందించేందుకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శనివారం వర్షపు నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు విద్యార్థులకు వర్షపు నీటిని సేకరించడం, భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించడం, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో వర్షపు నీటి సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించి, తమ కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలకు కూడా వర్షపు నీటి సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, "వర్షం పడిన చోటే.. పడినప్పుడే నీటిని సేకరిద్దాం" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, భవిష్యత్ తరాలకు నీటి వనరులను కాపాడేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాజేందర్, మెప్మా సహాయ జిల్లా మిషన్ సమన్వయకర్త మోతీరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, జూనియర్ సహాయకుడు నారాయణ, పట్టణ ప్రణాళిక విభాగం హరికృష్ణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఆషాడ తొలి ఏకాదశి పూజలు

### - నేడు ఆలయంలో మహా అన్నప్రసాద వితరణ

**ఆసిఫాబాద్ టౌన్, జులై 25, ప్రభాతవార్త**

ఆషాడ తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆయలంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎక్కాహం కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్ శర్మ, శ్రీనివాసశర్మల ఆధ్వర్యంలో స్వామివారికి గణపతిపూజ, ఫలపుష్పార్చన, నవగ్రహపూజ, అభిషేకం, మంగళహారతి, మహామంత్రపుష్పాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణానికి చెందిన చిలువేరు శంకర్ దాస్, విజయలక్షిల ఆధ్వర్యంలో నిర్వహించిన భజనా కార్యక్రమం పలువురిని ఆకట్టుకొన్నాయి. ఎక్కాహం కార్యక్రమం శనివారం ఉదయం 11.30 ని.లకు ప్రారంభమై ఆదివారం ఉదయం 11.30 గంటల వరకు ముగుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయం ఆవరణలో మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి క్రుపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ నియోజకవర్గానికి నూతన మండల అధ్యక్షుల నియామకం

**ఆసిఫాబాద్, జులై 25, ప్రభాతవార్త :**



ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని 8 మండలాలతో పాటు ఆసిఫాబాద్ పట్టణానికి నూతన మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించినట్లు కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ మండల అధ్యక్షులుగా రాపర్తి మురళి(రూరల్), మీర్కషిఫ్ హష్మీ ఇమ్రాన్ (టౌన్)లు నియమితులయ్యారని పేర్కొన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు కీలక పాత్ర పోషించాలని ఆమె ఆకాంక్షించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నూతన అధ్యక్షులకు ఆమె సూచించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుల నియామకాలకు ఆమోదం తెలిపిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర నాయకత్వానికి డిసిసి అధ్యక్షురాలు కృతజ్ఞతలు తెలిపారు.

## నిరక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోతారు

**ఆసిఫాబాద్, జులై 25, ప్రభాతవార్త :**



అర్హులైన ప్రతీ ఒక్కరు నిరక్ష్యం చేయకుండా వెంటనే తమ ఎస్ఐఆర్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ సూచించారు. పట్టణంలోని బజార్ వాడి పరిధిలో శనివారం జిఎస్ఐఆర్‌చ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ స్థానిక నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన సమయంలో దరఖాస్తు చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి సంబంధిత బిఎల్ఓలకు సకాలంలో అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దూడల అశోక్, సాయి శ్రవణ్, బిఎల్ఓ లక్ష్మీ, మున్సిపల్ సిబ్బంది రామయ్య, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

### - దేగామ చెరువులో మునిగి కోల్వారి వాసి దుర్మరణం

**బజార్‌హత్నూర్, జులై 25, ప్రభాతవార్త:**



చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. బోథ్ సీఐ డి. గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కోల్వారి గ్రామానికి చెందిన చౌర్య అరుణ్ (48) శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3:00 గంటల సమయంలో గ్రామానికి చెందిన మరో ఎనిమిది మందితో కలిసి దేగామ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు.చెరువు అవతలి ఒడ్డుకు వెళ్లే క్రమంలో అరుణ్ నీటిలో మునిగిపోయాడు. అతనితో ఉన్న మిగతా వారికి కూడా ఈత రాకపోవడంతో కాపాడే ప్రయత్నం చేయలేకపోయారు. దీంతో అతను నీటిలో మునిగి మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం నుండి పోలీసు సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, కుంతలకు చెందిన గజఈతగాళ్లు గాలించగా శనివారం మధ్యాహ్నం 2:45 గంటలకు మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున మత్స్యకారులు, స్థానికులు వాగులు, చెరువుల్లోకి చేపల వేటకు వెళ్లకూడదని ఆయన హెచ్చరించారు.

## విద్యార్థుల ఐక్యతకు దక్కిన చారిత్రాత్మక విజయం

### - కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాపై ఏఐఎస్ఎఫ్ హర్షం

**భైంసా, జులై 25, ప్రభాతవార్త:**



నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా విద్యార్థులు చేసిన ఉధృత పోరాటానికి తుది విజయం లభించిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఐక్యతకు దక్కిన చారిత్రాత్మక విజయమని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ తెలిపారు. శనివారం ముధోల్ ఎస్సీ బాలికల వసతి గృహంలో సంఘం ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు స్వీట్లు పంపిణీ చేసి ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నెల రోజులుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు చేసిన నిరసనలకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థుల పోరాటానికి మద్దతుగా నిలిచిన ప్రజాసంఘాలకు, మీడియా ప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరిగినా ముందుండి పోరాడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, వసతి గృహ విద్యార్థినులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



## బిఎల్ఎస్, బిఎల్ఏల సమన్వయ సమావేశం నిర్వహణ

### - ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి: కూచాడి శ్రీహరి రావు

**సారంగాపూర్, జులై 25, ప్రభాతవార్త:**

మండలంలోని స్వర్ణ గ్రామంలో గల ఫంక్షన్ హాల్‌లో బూత్ లెవల్ సూపర్‌వైజర్లు (బిఎల్ఎస్), బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఏ) సమన్వయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కూచాడి శ్రీహరి రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ప్రతి బిఎల్ఎస్, బిఎల్ఏ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను పాటిస్తూ అన్ని పోలింగ్ బూత్‌లలో సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆగస్టు 3వ తేదీలోపు 100 శాతం అర్హులైన ఓటర్ల నమోదు, సవరణలు, ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి అయ్యేలా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్ హాది, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీంరెడ్డి, రాజమోహమ్మద్, జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి గాజుల రవికుమార్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొట్టె శేఖర్, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కౌట్ల (బి)లో గ్రామసభ నిర్వహణ

### - ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ పూర్తి

**సారంగాపూర్, జులై 25, ప్రభాతవార్త:**



మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా 202526 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పథకం రికార్డులను సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బల్గూరి అజయ్ మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లు, అపోహలకు తావులేకుండా పారదర్శకంగా ఉపాధి హామీ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించినందుకు సంబంధిత సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, శివరత్నం, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ, మెట్టు, ఉపాధి హామీ కూలీలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వర్షం వస్తే వరదే...

**పద్మావతి కాలనీ ప్రజలకు నరకయాతన - మురుగులోనే జీవనం... అధికారుల నిర్లక్ష్యమే శాపం**

**రోడ్లపై మురుగునీరు నిల్వ - దోమల విజృంభణ, దుర్వాసనతో ప్రజల అవస్థలు**

**ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు - వ్యాధుల భయంతో బిక్కుబిక్కుమంటున్న కాలనీవాసులు**

మంచిర్యాల ప్రతినిధి జులై 25, ప్రభాతవార్త

మందమర్రి మండలంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో గద్దెరాగడి తిమ్మాపూర్ శివారులోని 9వ వార్డు పద్మావతి కాలనీ ప్రజలు కనీస మౌలిక సదుపాయాలు లేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కాలనీలోని రోడ్లన్నీ చెరువులను తలపించేలా మారి, మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో ప్రజల జీవనం దుర్భరంగా మారింది. కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు, మురుగునీరు కలిసి రోడ్లపైనే నిలిచిపోతున్నాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి నుంచి వెలువడుతున్న దుర్వాసనతో కాలనీలో నివాసం ఉండలేని పరిస్థితి నెలకొంది. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిలిచిన నీటిలో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటుండగా, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా కాలనీలోకి రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి శాశ్వత చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హామీలు ఇవ్వడం తప్ప సమస్య పరిష్కారానికి ఎవరూ ముందుకు రావడం లేదని విమర్శిస్తున్నారు. వర్షాకాలం వచ్చిన ప్రతిసారీ ఇదే దుస్థితి పునరావృతమవుతోందని, వెంటనే కాలనీని సందర్శించి డ్రైనేజీ నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, మురుగునీటి పారుదల పనులను చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఫాగింగ్ నిర్వహించి, బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజలను వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి చర్యలు చేపట్టకపోతే పెద్దఎత్తున ఆందోళనకు దిగుతాం అని కాలనీవాసులు హెచ్చరించారు.



# వర్షానికి ఇల్లు కూలి నిరాశ్రయులైన కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ

**ఆలుగామలో కూలిన జాడి లింగయ్య ఇల్లు - బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరిహారం అందేలా చూస్తామని సజన్ కుమార్ హామీ**

కోటపల్లి, జూలై 25, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఆలుగామ గ్రామంలో శుక్రవారం కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి జాడి లింగయ్యకు చెందిన ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న కోటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎంబరి సజన్ కుమార్, జనరల్ సెక్రటరీ దుర్గం బ్రహ్మయ్య, కార్యదర్శి పల్లె సత్యయ్యలతో కలిసి బాధిత కుటుంబాన్ని నేరుగా పరామర్శించారు. తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీ కృష్ణ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. అనంతరం వెంటనే మండల తహసీల్దార్ రాఘవేందర్ రావు, ఆర్ఐలకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆపద సమయంలో వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకుడు సజన్ కుమార్‌కు ఆలుగామ గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఎంబరి సజన్ కుమార్, ఇతర నాయకులు

# పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై ఘాటు హెచ్చరిక

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 25, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై ఆధ్వర్యంలో ఆగ్రహ నిరసన కార్యక్రమం జరిగింది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ మాట్లాడుతూ రాజకీయ సంస్కారం లేకుండా కేటీఆర్‌పై అవహేళనగా మాట్లాడిన వంశీకృష్ణ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల్లో తిరగలేని పరిస్థితి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. ప్రజల సమస్యలు పక్కనపెట్టి, చవకబారు రాజకీయాలకు దిగజారడం ఎంపీకి తగదని విమర్శించారు. వెంకటస్వామి ఆధ్వర్యంలోని విశాఖ ట్రస్ట్ ద్వారా ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో స్పష్టంగా చెప్పాలని, చెన్నూరు నియోజకవర్గంలో ఎన్నికల హామీగా ఇచ్చిన 45 వేల ఉద్యోగాల్లో ఎంతమందికి న్యాయం చేశారో వెల్లడించాలని నిలదీశారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా గెలిచిన తర్వాత ప్రజలకు ఉపయోగపడే పనులు ఏవీ చేయలేదని, ఉద్యోగాల విషయంలో పూర్తి విఫలమయ్యారని ఆరోపించారు. ఇకపై కేటీఆర్ లేదా బీఆర్ఎస్ నాయకులపై అనవసరంగా మాట్లాడితే పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అడుగు పెట్టనివ్వమని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గాదె సత్యం, యువజన విభాగం అధ్యక్షుడు కాటం రాజుకుమార్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకులు దగ్గుల మధు, రాష్ట్ర నాయకులు గోగుల రవీందర్ రెడ్డి, బెల్లం అరుణ్, ఎర్రోళ్ల నరేష్, ఆడెపు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






## మండల అధ్యక్షుడిగా మహమ్మద్ సుజాయిత్ ఖాన్ నియామకం

కెరమెరి, జూలై 25 ప్రభాతవార్త:

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కాంగ్రెస్ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. యువ నాయకుడు, విద్యావంతుడైన మహమ్మద్ సుజాయిత్ ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ కెరమెరి మండల అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో పార్టీ అధిష్ఠానం యువతకు ప్రాధాన్యం ఇస్తోందని ఈ నియామకం స్పష్టం చేస్తోంది. చదువుకున్న నాయకత్వం ప్రజల సమస్యలను సమర్థంగా అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించగలదనే నమ్మకంతో సుజాయిత్ ఖాన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సుజాయిత్ ఖాన్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, కెరమెరి మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తానని చెప్పారు.

## ఇది విద్యార్థుల విజయభేరి: ఎన్.ఎస్.యు.ఐ నాయకుడు అంజద్ షేక్

**- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చారిత్రక విజయం**

భైంసా, జులై 25, ప్రభాతవార్త:



దేశవ్యాప్తంగా విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేసిన నిరంతర పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, ఇది విద్యార్థులు సాధించిన చారిత్రక విజయమని ఎన్.ఎస్.యు.ఐ నిర్మల్ జిల్లా మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజద్ షేక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, కేంద్ర మంత్రి రాజీనామా అనేది కేవలం పాక్షిక విజయం మాత్రమేనని ఆయన తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వైఫల్యాల వల్ల వరుసగా ప్రశ్నపత్రాలు లీక్ అయి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ విద్యావ్యవస్థలో తక్షణమే సమూల మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థలో గుణాత్మకమైన మార్పులు వచ్చేంత వరకు విద్యార్థుల పక్షాన ఈ పోరాటం నిరంతరాయంగా కొనసాగుతుందని అంజద్ షేక్ స్పష్టం చేశారు.

## ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు

**- గురుభక్తి, ఆత్మగౌరవానికి ఏకలవ్యుడు ప్రతీక: మాజీ ఎమ్మెల్యే**

భైంసా, జులై 25, ప్రభాతవార్త:

ఆత్మగౌరవానికి, గురుభక్తికి, పట్టుదలకు ప్రతీక అయిన వీర ఏకలవ్యుని జయంతి వేడుకలను భైంసా మండలం దేగాం గ్రామంలో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి, దేగాం సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి, ఉపసర్పంచ్ బాలేకర్ శివాజి, మాజీ సర్పంచ్ బొబ్బిలి శ్రీనివాస్, వీడీసీ ఛైర్మన్ నాని లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ ఎల్లప్ప, వీడీసీ క్యాషియర్ సున్నపు లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరై ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమెడా లింగం మాట్లాడుతూ.. ఏకలవ్యుడు ప్రత్యక్ష గురువు లేకపోయినా పట్టుదలతో విలువిద్యలో అద్భుత ప్రావీణ్యం సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. యువత కులమతాలకు అతీతంగా విద్యనభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు సుదర్శన్ గౌడ్, చోటు, సిద్ధు, చందు రెడ్డి, ఎరుకల సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## పచ్చదనం పెంచితేనే ప్రకృతికి రక్షణ

### - ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపు

**మందమర్రి, జూలై 25, ప్రభాతవార్త**

ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మందమర్రి మార్కెట్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మొక్కల నాటడం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కరోనా మహమ్మారి పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేసిందని, భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నాదిపాట రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి సంజీవ్, జావీద్ పాషా, పృథ్వి, దిలీప్, కుమారస్వామి, పప్పు వినోద్, అరం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్తజనం

**చెన్నూరు, జూలై 25, ప్రభాతవార్త**

పండుగలలో మొదటిదైన తొలి ఏకాదశి పండగను పురస్కరించుకుని గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి భక్తులు పోటెత్తారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణ సమీపంలోని పంచక్రోశ ఉత్తర వాహిని గోదావరి తీరానికి పెద్ద ఎత్తున భక్తజనం తరలిరావడంతో గోదావరి తీరం ఆధ్యాత్మిక శోభతో పులకరించింది. తెల్లవారుజామునుంచే చెన్నూరు పరిసర ప్రాంతాలతో పాటు పట్టణాలనుంచి భక్తులు గోదావరి స్నానం ఆచరించి గంగాదేవికి ప్రత్యేక పూజలు, దివ్యహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్తర వాహిని కావడంతో మండలంలోని పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో గోదావరి తీరం కిటకిటలాడింది.

## స్వామివారి పాదుకలతో భక్తుల పాదయాత్ర

### - నామస్మరణతో మార్మోగిన చెన్నూరు ఆలయ పరిసరాలు

**చెన్నూరు, జూలై 25, ప్రభాతవార్త**

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర నిర్వహించారు. స్థానిక అంబ అగస్త్యేశ్వరాలయం నుంచి శ్రీ రుక్మాయి వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు స్వామి వారి పాదుకలు మోస్తూ మంగళ వాయిద్యాల నడుమ పాదయాత్ర కొనసాగించారు. స్వామి వారి నామస్మరణ చేస్తూ భక్తులు పాదయాత్రగా రుక్మాయి వెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. తొలి ఏకాదశి పర్వదినాన నిర్వహించిన ఈ పాదయాత్రతో చెన్నూరులో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మంగళ వాయిద్యాలు, స్వామివారి నామస్మరణలతో ఆలయ పరిసరాలు భక్తి మయంగా మారాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీరాంభట్ల వెంకట నాఘ రాఘ శర్మ, దుర్గా శంకర్ సోముని, జాడి తిరుపతి, కొమ్మెర నవీన్, సుసర్ల సురేష్, హరి వర్ధన్, రెడ్డి మహేష్, నూక శంకర్, విశ్వహిందూ పరిషత్ లక్ష్మణ్ రావు, గన్ను పాండురంగా, వీరబ్రహ్మం, సంతోష్ సోముని, కొల్లూరి శంకర్, మారగొని మధుకర్, మూర్ల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



# ఐకే-1ఏ గనిని సందర్శించిన ఏఐటీయూసీ నేతలు

### - కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ

**నస్పూర్, జూలై 25, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే-1ఏ గనిని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా తదితర నాయకులు శనివారం సందర్శించారు. గనిలోని ప్రతి విభాగాన్ని పరిశీలిస్తూ, కార్మికులను నేరుగా కలిసి పని ప్రదేశాల్లో వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అవసరమైన పనిముట్లు సరిపడా అందుబాటులో లేకపోవడం వల్ల పనులు సకాలంలో పూర్తి చేయలేకపోతున్నామని కార్మికులు వివరించారు. అలాగే గనిలోకి వెళ్లే మ్యాన్‌వే వద్ద వర్షం, ఎండల నుండి రక్షణ పొందేందుకు శాశ్వత షెడ్డు నిర్మించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న వాష్‌రూమ్‌లు సరిపోవడం లేదని, వాటి సంఖ్యను పెంచి క్రమం తప్పకుండా పరిశుభ్రం చేయించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు తాగునీటి సౌకర్యం, భద్రతా పరికరాల సరఫరా, ఇతర మౌలిక వసతుల కల్పనపై వినతులు అందించారు. కార్మికులు తెలిపిన ప్రతి సమస్యను సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని ఏఐటీయూసీ నాయకులు స్పష్టమైన హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమం, భద్రత, మెరుగైన పని వాతావరణం కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి నవీన్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్, సురేష్, నరసయ్య, సురేష్, కేశవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు

## పాత పెన్షన్ పునరుద్ధరణే లక్ష్యం...

### - ఉద్యోగుల గళమెత్తిన జనజాగరణ యాత్ర

**భారీ ద్విచక్ర వాహన ర్యాలీ - అంబేద్కర్ విగ్రహం వద్ద మౌన దీక్ష - ఎమ్మెల్యేకు వినతిపత్రం**

**మంచిర్యాల, జూలై 25, ప్రభాతవార్త**



పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, ప్రస్తుత కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు మంచిర్యాలలో శనివారం జనజాగరణ యాత్ర నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జరిగిన భారీ ద్విచక్ర వాహన ర్యాలీతో పాటు అంబేద్కర్ విగ్రహం వద్ద మోన దీక్ష చేపట్టి, పెన్షన్ హక్కును పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగుల భవిష్యత్ భద్రత దృష్ట్యా పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు వినతిపత్రం అందజేయగా, సమస్యను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.



## శ్రీరాంపూర్ ఎస్ఓటు జీఎం కృష్ణ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ, ఓబీసీ అసోసియేషన్ నాయకులు

**నస్పూర్, జూలై 25, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓటు జీఎంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణ ప్రసాద్‌ను బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆయనతో వివరంగా చర్చించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కృష్ణ ప్రసాద్ విజయవంతంగా విధులు నిర్వహిస్తూ, ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి చంద్రమోహన్, జాయింట్ సెక్రటరీ రఘురాం, నాయకులు తిరుపతి, సాంబయ్య, పిట్ సెక్రటరీలు వినోద్, మనోజ్, మదన్, నరేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఖానాపూర్ ఎమ్మెల్యేపై తగిన చర్యలు తీసుకోవాలి

### - బాసర పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకుల ఫిర్యాదు

**భైంసా, జులై 25, ప్రభాతవార్త:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, ఆయన అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాసర మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పిలుపు మేరకు శనివారం బాసర పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ శ్యామ్‌కు వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాసర మండల బీజేపీ అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు ఎంతో గౌరవంతో చూస్తుంటే, దేశంలోనే ఉంటూ ప్రధానిని అవమానించేలా మాట్లాడటం తీవ్ర విచారకరమన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వెడ్మా బొజ్జుతో పాటు ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సతీష్ రావు, పోగుల రాజేశ్వర్, బిదూర్ రమేష్, సాకలి సాయినాథ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

### - ఆగస్టు 1 వరకు గడువు: జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు

**నిర్మల్, జులై 25, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ పోస్టును తెలంగాణ ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్ నిబంధనల ప్రకారం భర్తీ చేయనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఇంగ్లీష్ చదవడం, రాయడంతో పాటు కంప్యూటర్ అప్లికేషన్స్, ఎంఎస్ ఎక్సెల్, లార్జ్ డేటా హ్యాండ్లింగ్, వేగవంతమైన టైపింగ్ నైపుణ్యాలు ఉండాలని తెలిపారు. రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, వయోపరిమితి, వేతనం ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్ నిబంధనల ప్రకారం ఉంటాయని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలు, బయోడేటాతో కూడిన దరఖాస్తులను ఆగస్టు 1, 2026 సాయంత్రం 5:00 గంటలలోగా కలెక్టరేట్ (ఐడీఓసీ)లోని గది నెం. ఎస్3లో ఉన్న జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి కార్యాలయంలో నేరుగా సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు హార్టికల్చర్ ఆఫీసర్ (టెక్నికల్)ను 8977713947 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని అధికారులు తెలిపారు.



# రక్తదానమే జన్మదిన వేడుకగా...

# యువతకు ఆదర్శంగా నిలిచిన రుతిక్

**తలసేమియా, సికిల్ సెల్ బాధితుల కోసం స్వచ్ఛంద రక్తదానం - రక్తదాతలను అభినందించిన రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి**

మంచిర్యాల, జూలై 25, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం అనాథ పిల్లల ఆశ్రమం, వృద్ధుల ఆశ్రమంకు గత 18 సంవత్సరాలుగా సేవలందిస్తున్న దంపతులు బొడ్డుపల్లి సదానందం దంపతుల కుమారుడు బొడ్డుపల్లి రుతిక్ తన 21వ జన్మదినాన్ని సమాజ సేవకు అంకితం చేస్తూ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. రుతిక్ జన్మదినాన్ని పురస్కరించుకుని తలస్సెమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉపయోగపడేలా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో బొడ్డుపల్లి సదానందం, వారి మిత్రుడు పవన్, బొడ్డుపల్లి రుతిక్, ఆనంద నిలయంలో ఆశ్రయం పొంది విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు సాయి సంపత్, మణి, చంద్రమోళి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా ఛైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, రుతిక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, తన పుట్టినరోజును సేవా కార్యక్రమంతో జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన యువకులను ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రం సిబ్బంది పాల్గొని రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



రక్తదానం చేస్తున్న సభ్యులు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## ఆలయాల్లో పోటెత్తిన భక్తులు

బెజ్జూర్, జూలై 25, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండల కేంద్రంలోని ఆలయాలు శనివారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడ. మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక దేవాలయం, శివాలయం, హనుమాన్ ఆలయం, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో ఉదయం 5 గంటల నుండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు మొదలయ్యాయి. భక్తులు శ్రీ రంగనాయక స్వామి వారికి పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఎక్కామ భజన కార్యక్రమాన్ని భక్తులు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం తొలి ఏకాదశి రోజున ఎక్కామ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగేడి పల్లి మహేష్ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులు భక్తులకు తొలి ఏకాదశి పర్వదినం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఆసిఫాబాద్, జులై 25, ప్రభాతవార్త

చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగిఉండాలని డిఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి సంకేత్ మిత్ర పేర్కొన్నారు. శనివారం జైనూర్ మండలంలో గృహహింస నిరోధక చట్టంపై జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి త్రతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల మధ్య రాజీ ద్వారా త్వరగా తక్కువ ఖర్చుతో వివాదాలను పరిష్కరించవచ్చన్నారు. అదేవిధంగా లోక్ అదాలత్ తీర్పు అంతిమమైనదని, ఖచ్చితమైనదని తెలిపారు. జాగృతి స్కీంకు సంబందించిన వివరాలను వివరించారు. గృహహింస నిరోధక చట్టం మహిళలను కుటుంబంలోని వేదింపుల నుండి రక్షించడానికి తెచ్చిన ముఖ్యమైన చట్టమని, శారీరక, మానసిక, ఆర్థిక, లైంగిక వేధింపుల నుండి బాధితులకు రక్షణ, నివాసం హక్కు అలాగే ఆర్థిక సహాయం అందించడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కొడప మోతుబాయి, అసిస్టెంట్ ఎల్ఏడీసీఎస్ అడ్వకేట్ అంజనాదేవి, అడ్వకేట్ ప్రదీప్ నాయక్, సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## జైనూర్ కాంగ్రెస్‌కు కొత్త సారథి

### - మండల అధ్యక్షుడిగా షేక్ రషీద్ నియామకం

జైనూర్, జులై 25, ప్రభాతవార్త:



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా షేక్ రషీద్‌ను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు నూతన అధ్యక్షుడు షేక్ రషీద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జైనూర్ మండల వైస్ ఎంపీపీగా పనిచేసిన తన సేవలను గుర్తించి మండల కమిటీ అధ్యక్షుడిగా నియమించినందుకు టీపీసీసీ అధ్యక్షుడు, డిసిసి అధ్యక్షుడు, ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకుని సమన్వయంతో పనిచేస్తూ జైనూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



## బెల్లంపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ డ్రా మోసం

### - అర్హులను మోసం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

బెల్లంపల్లి, జూలై 25, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రా పేరుతో అర్హులను మోసం చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. లక్కీ డ్రా తీసి మూడు నెలలు గడిచినా, ఇప్పటికీ అర్హుల చేతికి ఇళ్ల తాళాలు అందకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎంసీపీఐయు పార్టీ నాయకులు మండిపడ్డారు. శనివారం ఎంసీపీఐయు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల ముందు గొప్పగా లక్కీ డ్రా నిర్వహించి వెంటనే ఇళ్లు ఇస్తామని హామీలు ఇచ్చిన అధికారులు ఇప్పుడు పూర్తిగా మాట తప్పారని తీవ్రంగా విమర్శించారు. అర్హులైన పేద ప్రజలను ఆశలతో ఆటలాడిస్తూ వారిని అయోమయంలోకి నెట్టేశారని ఆరోపించారు. డ్రాలో ఎంపికైన లబ్ధిదారులు తమకు ఇళ్లు వస్తాయా రావా అన్న అనిశ్చితిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడం అమానుషమని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై స్పందించాల్సిన ప్రజాప్రతినిధులు కూడా మోనం వహించడం మరింత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి డ్రాలో ఎంపికైన ప్రతి అర్హునికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల తాళాలు అప్పగించాలని గట్టిగా డిమాండ్ చేశారు. లేకపోతే అన్ని లబ్ధిదారులను ఒక్కచోట చేర్చి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ఆందోళన, ధర్నా కార్యక్రమాలు చేపడతామని కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తోగరి రాహుల్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్యారమూర్‌లో ఉపాధి హామీపై సమీక్ష

### ఉపాధి హామీ, ఆసరా పెన్షన్ల సామాజిక తనిఖీ పూర్తి

సారంగాపూర్, జులై 25, ప్రభాతవార్త:

మండలంలోని ప్యారమూర్ గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులు, ఆసరా పెన్షన్ల సామాజిక తనిఖీ శనివారం పూర్తయింది. ఈ సందర్భంగా సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆడిటర్ సోషల్ ఆడిట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను గ్రామస్తులకు వివరంగా తెలియజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, అందరూ సమన్వయంతో ఉపాధి హామీ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేందర్ సింగ్, టిఏ పోశెట్టి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి, కరోబర్ భూషణ్ రెడ్డి, వార్డు సభ్యులు మాధ దయాకర్, శ్రీరామ్, లక్ష్మణ్, పగడపు లక్ష్మణ్ (చింటూ), పగడపు ముత్తవ్వ, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

### - జిల్లా న్యాయమూర్తి అనంతలక్ష్మి

జైనూర్, జులై 25, ప్రభాతవార్త:

మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా న్యాయమూర్తి అనంతలక్ష్మి తెలిపారు. శనివారం జైనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ యార్డులో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గృహహింస నిరోధక చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి అనంతలక్ష్మి మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు చట్టాలు ఎంతో దోహదపడతాయన్నారు. గృహహింస చట్టం మహిళల రక్షణకు కొండంత అండగా నిలుస్తుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సంకేత్ మిత్ర మాట్లాడుతూ.. మహిళలకు రక్షణగా ఉన్న చట్టాలపై అవగాహన కల్పించేందుకే ఈ సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. అన్యాయం జరిగినప్పుడు బాధితులు చట్టాన్ని ఆశ్రయించాలని, నిరుపేదలకు ఉచితంగా న్యాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో జైనూర్ సీఐ రమేష్, మండల సమైక్య అధ్యక్షురాలు కొడప మోతు బాయి, న్యాయవాదులు అంజనా దేవి, ప్రదీప్ నాయక్, నాగరాజు, ఐకేపీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి

### - అధైర్య పడకండి అండగా ఉంటాం - విద్యార్థినిలకు సూచించిన సీఐ బన్సీలాల్

చెన్నూరు, జూలై 25, ప్రభాతవార్త




ఇటీవల గురుకుల విద్యాలయాల్లో జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో విద్యార్థినిలు ధైర్యంగా ఉండాలని, చిన్న చిన్న సమస్యలకు అధైర్యపడవద్దని, సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ విద్యార్థినిలకు సూచించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను సీఐ బన్సీలాల్ తన సిబ్బందితో కలిసి సందర్శించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయునిలతో కలసి విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, ఉన్నత స్థితిలో ఉన్న మహిళలను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని, చిన్న చిన్న వాటికి కృంగిపోయి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని సూచించారు. అదే విధంగా గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో స్కూల్ నుంచి అత్యధికంగా 574 మార్కులు సాధించిన విద్యార్థినితో పాటు మంచి మార్కులు సాధించిన వారిని అభినందించారు. అనంతరం విద్యార్థినులకు సైబర్ క్రైమ్స్, పోక్సో చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ప్రతివారం పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బందితో కలిసి స్కూల్ ను విజిట్ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సాహెరా, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.